# సత్యవాక్యం

# THE WORD OF TRUTH

స్తవ మాసపత్రిక

APRIL 1996

# మీకొక సదవకాశము

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న "సత్యవాణి" అను రేడియో కార్యక్రమము ద్వారా మరియు మేము ప్రచురించు పుస్తకముల ద్వారా లక్షలాది ప్రజలు ఆత్మీయ మేలులను పొందుచున్నారు.

మీరు బైబిలు సత్యములను సులువుగా గ్రహించు నిమిత్తము సత్యవాణి రేడియో ప్రసంగములు, తదితర పుస్తకములు అనేకములు మావద్ద కలవు. మీరు కేవలము రూ. **25/** –లు ఈ క్రింది అడ్రసుకు **M.O.** చేసినచో రూ.100/ –లకు మించిన విలువగల 15 నుండి 20 రకముల పుస్తకములు మరియు 2 సంవత్సరములవరకు "సత్యవాక్కు" అను మాసపత్రికను మీరు పొందగలరు.

వెంటనే మీ పేరు నమోదు చేయించుకొనండి. మీ యింటిలో ఒక మినీ క్రైస్తవ గ్రంథాలయము తెరవండి. మావద్దలభించు పుస్తకముల రేట్లు వివరములు పోస్టేజీతో సహా

| | |
|---|---|
| 1 కీర్తన పుస్తకం | రూ.14–00 |
| 2 పెద్ద అచ్చు బైబిలు | 110–00 |
| 3. రిఫరెన్సు బైబిలు | 75–00 |
| 4. 15 నుండి 20 మంచి పుస్తకములు మరియు 2 సంవత్సరముల పాటు సత్యవాక్కు మాసపత్రిక ఉచితం | 25–00 |

గమనిక : మీరు పంపు సైకము **M.O.** ద్వారా పంపవలెను. దేనికొరకు మీరు సొమ్ము పంపుతున్నారో కూడ వ్రాయండి.


**SATYA VANI**

Sambamurthi Street, Ramaraopet,

KAKINADA - 533 004.

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

P.o. Box 80, Kakinada, A.P. 533 001
Phone : 0884-63722

Editor :
**J.C. CHOATE**

Managing Editor :
**JOSHUA GOOTAM**

Pleading for Restoration of First Century Christianity

సంపుటి 16 ఏప్రిల్ 1996 సంచిక 9

## దేవుని వాక్యమును చదువుట కుపకరించుము

## (Give Attendance to Studying God's Word)

"నేను వచ్చువరకు చదువుట యందును, హెచ్చరించుట యందును, బోధించుట యందును జాగ్రత్తగా ఉండుము" అని అపో. పౌలు తిమోతిని హెచ్చరించాడు (I తిమో 4 : 13). "నీ అభివృద్ధి అందరికీ తేటగా కనబడు నిమిత్తము వీటిని మనస్కరించుము, వీటియందే సాధకము చేసికొనుమని" అతడు మరల చెప్పాడు (I తిమో 4 : 15). "దేవుని యెదుట యోగ్యునిగాను, సిగ్గుపడనక్కరలేని పనివానిగాను, సత్యవాక్యమును సరిగా ఉపదేశించు వానిగాను నిన్ను నీవే దేవునికి కనపరచుకొనుటకు జాగ్రత్తపడుము" అని 2 తిమోతి 2 : 15 లో వ్రాయబడి యున్నది.

"మీరు నా వాక్యమునందు నిలిచిన వారైతే నిజముగా నాకు శిష్యులై యుండి సత్యమును గ్రహించెదరు. అప్పుడు సత్యము మిమ్మును

స్వతంత్రులనుగా చేయునని" యేసు ప్రభువు చెప్పారు (యోహాను 8 : 31). దేవుని గూర్చియైన సత్యము నెరిగినంత మట్టుకు మనము స్వతంత్రులమే. అందువలన మనము దేవుని వాక్యమును చదువుటకు, ధ్యానించుటకు, మనస్కరించుటకు సమయాన్ని వెచ్చించాలి.

మనము ఆయన గ్రంథమును దినదినము పఠించాలని దేవుడు కోరుచున్నాడు. ఆయన తన గ్రంథాన్ని లిఖించి యిచ్చారు గనుక, దీన్ని మనం చదవాలనే ఆయన కోరుచున్నారు. "యెహోవా గ్రంథమును పరిశీలించి చదువుకొనుడి" యని ప్రవక్తయైన యెషయా పలికాడు. (యెషయా 34 : 16). దేవుని యొక్క నిబంధనలను మోషే ఇశ్రాయేలీయులకు చదివి వినిపించేవాడు. అతడు యెహోవా మాటలన్నిటిని విధులన్నిటిని ప్రజలతో వివరించి చెప్పెను. ప్రజలందరూ యెహోవా చెప్పిన మాటలన్నిటి ప్రకారము చేసెదమని ఏక శబ్దముతో ఉత్తరమిచ్చిరి (నిర్గమ 24 : 3 - 4). ప్రతి యేడవ సంవత్సరాంతమున ఇశ్రాయేలీయులలో పురుషులేమి, స్త్రీలేమి, పిల్లలేమి, పరదేశులేమి వారందరి యెదుట దేవుని ధర్మ శాస్త్రము ప్రకటింపబడి వారికి వినిపింపబడేది (నిర్గమ 31 : 10-12).

రాజైన యోషియా కాలములో ధర్మశాస్త్ర గ్రంథము వారికి దొరికెను. "అప్పుడు రాజు యూదా పెద్దలందరిని, యెరూషలేము పెద్దల నందరిని తన యొద్దకు పిలువనంపించి, యూదా వారినందరిని, యెరూషలేము కాపురస్తులనందరిని యాజకులను ప్రవక్తలను, అల్పులనేమి, ఘనులనేమి జనులందరిని పిలుచుకొని, యెహోవా మందిరమునకు వచ్చి వారు వినుచుండగా, యెహోవా మందిరమందు దొరికిన నిబంధన గ్రంథములోని మాటలన్నిటిని చదివించెను" (2 రాజులు 23 : 1 - 2).

శాస్త్రియైన ఎజ్రా కాలములో దేవుని గ్రంథము సుదీర్ఘముగా చదివి వినిపించబడేది. "ఇశ్రాయేలీయులు అన్యజనులందరిలోనుండి ప్రత్యేకింపబడిన

న్నారై నిలువబడి తమ పాపములను, తమ పితరుల పాపములను ఒప్పుకొనిరి. మరియు వారు ఒక జాము సేపు తామున్న చోటనే నిలువబడి, తమ దేవుడైన యెహోవా ధర్మ శాస్త్ర గ్రంథమును చదువుచు వచ్చిరి (నెహెమ్యా 8,9 అధ్యా).

దేవుని ధర్మశాస్త్రగ్రంథముమ ప్రజలు తప్పక చదవాలి యని యేసు ప్రభువు కూడ గుర్తించారు. "ఆయన వారితో ఇట్లనెను - తానును తనతో కూడ నున్నవారును ఆకలిగొని యుండగా దావీదు చేసిన దానిని గూర్చి మీరు చదువలేదా?" (మత్త 12 : 3). "మృతుల పునరుత్థానమును గూర్చి - నేను అబ్రహాము దేవుడను,. ఇస్సాకు దేవుడను యాకోబు దేవుడనై యున్నానని దేవుడు మీతో చెప్పిన మాట మీరు చదువలేదా?" యని ఆయన మరొక మారు ప్రశ్నించారు (మత్త 22 : 31). మీరు చదువలేదా? యని యేసు ప్రభువు తన్ను వెంబడించువారిని పలుమారులు ప్రశ్నించినట్లు క్రొత్త నిబంధనలో మనము చూడగలము.

యేసు ప్రభువు తానే దేవుని గ్రంథాన్ని చదివేవారు. "ఆయన తాను పెరిగిన నజరేతునకు వచ్చెను. తన వాడుక చొప్పున విశ్రాంతి దినమందు సమాజమందిరములోనికి వెళ్లి చదువుటకై నిలుచుండగా......." అని లూకా 4 : 16 లో వ్రాయబడియున్నది. అపొ. పౌలు పరిశుద్ధాత్మ ప్రేరణతో తాను వ్రాసిన సంగతులను "మీరు చదివిన యెడల దానినిబట్టి ఆ క్రీస్తు మర్మమును గూర్చి నాకు కలిగిన జ్ఞానమును గ్రహించుకొనగలరు." అని చెప్పాడు (ఎఫెసీ 3 : 3, 4). మరియు థెస్సలోనీకయలోని సంఘమునకు వ్రాయుచు "సహోదరులందరికినీ ఈ పత్రిక చదివి వినిపించవలెనని ప్రభువు పేరట మీకు ఆనబెట్టుచున్నాను" అని చెప్పాడు (I థెస్స 5 : 27).

ఐతియోపేయ ఘనుడు ఆరాధించుటకు యెరూషలేముకు వచ్చి యుండెను. అతడు తిరిగి వెళ్లుచు తన రథము మీద కూర్చుండి ప్రవక్తయైన యెషయా గ్రంథము చదువుచుండెను (అపొ. కా. 8 : 27 - 28). "ఈ ప్రవచన

వాక్యములు చదువువాడును, వాటిని విని యిందులో వ్రాయబడిన సంగతులను గైకొను వారును ధన్యులు" అని భక్తుడైన యోహాను వ్రాసాడు (ప్రక 1 : 3).

ఎవరైనా మనకు ఉత్తరాలు వ్రాస్తే వాటిని మనం చదువుతామనే కోరికతోనే గదా వారు వ్రాసేదీ? అట్లే దేవుడు మనకు లిఖించి యిచ్చిన తన వర్తమానాన్ని మనం చదవాలనియే కోరుచున్నారు. ఆయన గ్రంథమును చదువువారును, దానిలో వ్రాయబడిన సంగతులను గైకొనువారును ధన్యులవుతారు. భక్తుడైన దావీదు ఇట్లు చెప్పాడు : "దుష్టుల ఆలోచన చొప్పున నడువక, పాపుల మార్గమున నిలువక అపహాసకులు కూర్చుండు చోటను కూర్చుండక, యెహోవా ధర్మశాస్త్రమునందు ఆనందించుచు, దివారాత్రము దానిని ధ్యానించువాడు ధన్యుడు. అతడు నీటి కాలువల యోరను నాటబడినదై ఆకు వాడక తన కాలమందు ఫలమిచ్చు చెట్టువలె యుండును" (దా. కీర్తన 1 : 1 - 3).

"దేవుని వాక్యమును విని దానిని గైకొనువారు మరి ధన్యులని" యేసు ప్రభువు చెప్పారు (లూకా 11 : 28). ఇందు విషయమై ఆయన ఇట్లు బోధించారు: "కాబట్టి యీనా మాటలు విని వాటి చొప్పున చేయు ప్రతివాడును బండమీద తన యిల్లు కట్టుకొనిన బుద్ధిమంతుని పోలి యుండును. వాన కురిసెను, వరదలు వచ్చెను. గాలి విసిరి ఆ యింటి మీద కొట్టెనుగాని దాని పునాది బండ మీద వేయఃబడెను గనుక అది పడలేదు. మరియు ఈనా మాటలు విని వాటి చొప్పున చేయని ప్రతి వాడు ఇసుక మీద తనయిల్లు కట్టుకొనిన బుద్ధిహీనుని పోలియుండును. వానకురిసెను, వరదలు వచ్చెను, గాలి విసిరి ఆ యింటిమీద కొట్టెను, అప్పుడది కూలబడెను; దాని పాటు గొప్పదని చెప్పెను" (మత్తయి 7:24-28).

"అందుచేత సమస్త కల్మషమును, విస్తరించుచున్న దుష్టత్వమును మాని, లోపలనాటబడి మీ ఆత్మలను రక్షించుటకు శక్తిగల వాక్యమును సాత్వికముతో అంగీకరించుడి. మీరు వినువారు మాత్రమైయుండి మిమ్మును మీరు మోసపుచ్చుకొనకుండ వాక్యప్రకారము ప్రవర్తించువారునై యుండుడి" యని యాకోబు హెచ్చరించాడు (యాకోబు 1:21-22).

బైబిలు గ్రంథము దేవుని వాక్యము గనుక దానిని చదువునప్పుడల్లా, లేక దానిలోనిది చదివించుకొనునప్పుడల్లా దేవుడు మనతో మాట్లాడుచున్నాడని గ్రహించుకోవాలి. ఆయన తన గ్రంథమునకు వేరుగా ప్రత్యక్షముగా ఈనాడు ఎవరితోను మాట్లాడుటలేదు. ఆయన గ్రంథమును చదువుట ద్వారా గాని, లేక వినుట ద్వారాగాని మనకు విశ్వాసము కలుగును. "కాగా వినుట వలన విశ్వాసము కలుగును, వినుట క్రీస్తును గూర్చిన మాటవలన కలుగును" (రోమా 10:17). " మరియు అనేకమైన యితర సూచక క్రియలను యేసు తన శిష్యుల యెదుట చేసెను. అవి యీ గ్రంథమందు వ్రాయబడియుండ లేదుకాని, యేసు దేవుని కుమారుడైన క్రీస్తు అని మీరు నమ్మునట్లును, నమ్మి ఆయన నామమందు జీవము పొందునట్లును ఇవి వ్రాయబడెను" అని భక్తుడైన యోహాను వ్రాసాడు (యోహాను 20:30,31).

మనం యేసునందు విశ్వసించాలి, పాపముల విషయమై మారుమనస్సుపొందాలి, పాపక్షమాపణ నిమిత్తం బాప్తిస్మం పొందాలి. దినదినము ఆయన వాక్యాన్ని పఠించాలి, ఆత్మీయంగా ఎదగాలి!! అందులకై దేవుడు మనకు సహాయం చేయును గాక!!

# బైబిలు గ్రంథము

# (THE BIBLE)

బైబిలు అతి శ్రేష్టమైన గ్రంధము. అది మన భక్తిని, మన గౌరవమును, ప్రేమను, నమ్మకమును, విశ్వాసమును, మన అంతఃకరణమును మరియు మనవిధేయతను అధికము చేయుచున్నది. బైబిలు లేకున్నచో మనము నిష్ప్రహాయులము. నిత్యత్వమును గూర్చిన నిరీక్షణ లేకుండా, ఎటువంటి ఉద్దేశము లేకుండా, నడిపించు వారు లేకుండా సంచరించు వారుగా యుందుము. బైబిలు లేకపోతే క్రీస్తు యొక్క బలియాగమును, క్రీస్తురక్తమును గూర్చి, ఆయన మధ్యవర్తిత్వమును గూర్చి, ఆయన మన పక్షముగా వాదించుటను గూర్చి ఎరుగక యుందుము. బైబిలు లేకపోతే పాపమును, రక్షణ యొక్క అవసరత మరియు మన నిత్యత్వము మరియు మన గమ్యమును గూర్చిన జ్ఞానము లేక యుందుము.

బైబిలు అనుమాట గ్రంధమందలి పుటలలో కనబడుట లేదు, కాని దేవుని గ్రంధము ఒక ధర్మశాస్త్రము (కీర్త 119:97 యాకోబు 1:25), అది వాక్యము(కీర్తన 119:11) అది సత్యవాక్కు (II తిమోతి 2:15) అది దైవోక్తి (Iపేతురు 4:11) లేఖనములు (II తిమోతి 3:16; II పేతురు3:16) అపో.కార్య 17:11) అది బోధ (II యోహాను 9.వ వచనం. II తిమో 4:2,3) మరియు అది సత్యము (యోహాను 8:32;17:17). అది రెండంచులు గల ఖడ్గము (ఎఫెసీ 6:17) అది అగ్ని (యిర్మియా 23:29) అది సుత్తి (యిర్మియా 23:29) విత్తనము(లూకా 8:11) అది దీపము (కీర్త 119:105) అది వెలుగు (కీర్త 119:105).

బైబిలు అనునది జీవము లేనిదికాదు. హెబ్రీ గ్రంధకర్త వ్రాసిన విధముగా దేవుని వాక్యము సజీవమై బలము గలది మరియు శక్తిగలది (హెబ్రీ 4:12). దేవుని మాటచేత ప్రపంచములును ఆకాశములును కలిగెను (హెబ్రీ 11:3 కీర్త

33:6). బైబిలు బ్రతికించునది (కీర్త 119:50) అదిమనలను కనెను (యాకోబు 1:18) అది శుద్ధిచేయును (యోహా 15:3) అది పవిత్రులుగా చేయును (పేతురు 1:22) అది ప్రాణమును తెప్పరిల్లచేయును (కీర్త 19:7) రక్షించును (అపో 11:14 యాకోబు 1:21) హృదయములో నొచ్చు కొనునట్లు చేయును(అపో 2:36-38) అది కోయును (హెబ్రీ 4:12) మరియుతీర్పు దినమున తీర్పుతీర్చును (యోహాను 12:48).

మానవులచే రూపొందించబడిన ఇతర గ్రంధముల వలె కాక బైబిలు యదార్ధవంతమైనది (కీర్త 19:7). దైవావేశము వలన కల్గిన లేఖనము(II తిమోతి 3:16,17, I కొరింధి 2:10-13) అదినిత్యము ఉండునది (మత్తయి 24:35 పేతురు 1:24,25). మానవులు రచించిన పుస్తకములు ప్రజాదరణ పొందుటవలన నిలచియుండవచ్చు లేక పడిపోవచ్చు. కాని బైబిలు అన్ని సంవత్సరములలోను ఎక్కువ అమ్మకముగల గ్రంధముగా తన ఆధిక్యతను నిలుపుకొన్నది. అది నిలకడగా తిరిగి ప్రచురించబడుచున్నది. అయినప్పటికి బైబిలు ప్రస్తుతముతో సంబంధము కలది. ప్రస్తుత కాలమునకు చెందినది - పూర్వము ఎట్టి ప్రేరణను కలుగజేసినదో అట్టి ప్రేరణను ఇప్పుడు కూడా కలుగ జేయుచున్నది.

బైబిలును గూర్చి అనేక అభిప్రాయములున్నవి. కొందరు దీనిని వ్యతిరేకిస్తారు. కొందరు దీనితో పందెముకాస్తారు. కొందరు దీని ఎడల ఉదాసీనముగాయుంటారు, మరియు కొందరు ప్రేమిస్తారు. కొందరు కాపాడుకుంటారు మరియు గౌరవిస్తారు. చాలామంది యెహోయాకీము వలె దానిని కాల్చివేస్తారు. మరి కొందరు దావీదువలె దానినిప్రేమించి ధ్యానిస్తారు (యిర్మియా 36;23 కీర్త 119:97).

అయితే బైబిలు ఎడల నీ అభిప్రాయము ఏమైయున్నది.

- డాల్టన్‌కీ (Vot )

# అయ్యలారా,రక్షణపొందుటకు నేనేమి చేయవలెను?

## (Sirs, What must I do to be saved?)

(అపొ.కా.16;30)

ఫిలిప్పీ చెరసాల అధిపతిచే ఈ ప్రశ్న అడుగబడినది. ఈప్రశ్న అడిగిన సమయమున అతడు నశించిపోయిన స్థితిలో యుండెను. ఆ ప్రశ్న యొక్క ప్రాముఖ్యతను మన రక్షకుడు నొక్కిచెప్పుచున్నాడు: " ఒక మనుష్యుడు లోకమంతయు సంపాదించుకొని తన ప్రాణమును పోగొట్టుకొంటే అతని కేమి ప్రయోజనము"? లేక "ఒక మనుష్యుడు తన ప్రాణమునకుప్రతిగా యేమియ్యగలడు?" (మత్తయి 16 : 26). మనుష్యునికి ఆత్మ యున్నదని, అది రక్షింపబడవచ్చును లేక నశించిపోవచ్చునని మన రక్షకుడు యిక్కడ బోధించుచున్నాడు. ఒక మనుష్యుడు కొన్నిటిని చేసి రక్షణపొందగలడని, లేక మరేవో చేసి నాశనమగునని కూడ ఆయన చెప్పియున్నాడు. రక్షణ పొందుటకు యేమి చేయవలెనని పాపిని దేవుడు కోరుచున్నాడో దానిని మన పరిశోధనలో నేర్చుకొనగోరుచున్నాము.

మానవులను రక్షించుటకు దేవుడు వేర్వేరు మార్గములు కలిగియున్నాడని అనేకులు తలంచెదరు. అది నిజమైతే దానిని అందరు తెలిసికొనవలసినదే. "నీవు పరలోకమునకు వెళ్ళుటకు యే మార్గము చేపట్టినను ఒక్కటే" యనుట పరిపాటియైనది. పరలోకము పోవుటకు అనేక మార్గములున్నచో ఆ మాట వాస్తవమే. పరలోకానికి నడిపించుటకు వేర్వేరు మార్గములున్నవని ఋజువైనప్పుడు మనమే మార్గమున పోయినను ఫర్వాలేదు. కాని యిది ఋజువు కాబడలేదు. ఏలయనగా మనకు చెప్పుటకు యెవడును యెన్నడును పరలోకము నుండి తిరిగి రాలేదు. మరియు అటువంటి విషయమును బైబిలు చెప్పుట లేదు. క్రీస్తు

రెండే రెండు మార్గములను గూర్చి మాట్లాడుచున్నాడు .................నాశనమునకు త్రోవజూపు "విశాలమార్గము", జీవమునకునడిపించు "ఇరుకైన మార్గము' (మత్తయి 7:13,14). ఆయన వాస్తవమునే చెప్పినట్లయితే రక్షింపబడుటకు ఒకే ఒక మార్గమున్నది. అనేక మార్గములున్నవని మనుష్యుడెందుకు చెప్పవలెను? ఏమార్గమైనను ఒకటేయను కొనుట మిక్కిలి ప్రమాదకరము. సరియైన విచారణ సరియైన గమ్యస్థానమునకు చేర్చును. " ఒకని యెదుట సరియైనదిగా కనబడు మార్గము కలదు. అయితే అది తుదకు మరణమునకు త్రోపతీయును" (సామెతలు14:12).

## ఒకే ఒక్క మార్గము

ఒకే ఒకమార్గమున్నదని ఈ క్రింది వాస్తవములు తెలియజేయును:

(1) అపొస్తలులు భూమిమీద యుండగా "ఒకేఒక" సంఘముండెను. యెరూషలేములో యున్న సంఘమును పేతురు, పౌలు ఒక సంఘమును యాకోబువేరొక సంఘమును ప్రకటింపలేదు. వారందరు ఒకే సంఘ సభ్యులైయుండిరి.

(2)"అందరు ఏకభావముతో మాటలాడుడి"యని పౌలు చెప్పెను. (I కొరింథీ 1:10). " మారుమనస్సు పొంది పాపవిముక్తి నిమిత్తము మీలో ప్రతివాడును యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి"(అపొ.కా. 2:38) యని పేతురు చెప్పినపుడు, కడమ అపొస్తలులందరు అతనితో ఏకీభవించిరి. వారు ఆ విధముగా చేయనట్లయితే వారు వేర్వేరు సంఘములను ప్రకటించినవారే!

(3)"నీకు యిష్టమైన సంఘములో చేరుము" యని ఏ అపొస్తలుడును మార్పునొందిన వారికి చెప్పలేదు.

మోషేవలె క్రీస్తు మరణమునకు పూర్వము జీవించినవారు పాతనిబంధన చట్టము క్రిందయుండిరి. మనమైతే క్రొత్త నిబంధన చట్టముక్రింద జీవించుచున్నాము. ప్రజలు వేర్వేరు కాలములలో జీవింపవచ్చును. కాని ఆయాకాలములలో యున్న చట్టములు బాధ్యులైన పౌరులందరికి నిర్దేశింపబడినవి. అబ్రహాము, మోషే జీవించిన కాలములో గాక మనము వేరొక యుగములో నివసించుచున్నాము. ఈయుగమందున్న వారందరికి లేఖనానుసారమైన ఒకేఒక నియమావళి యున్నది. ఈ రక్షణ సంకల్పము దైవికమైనది.

రక్షణా పధకములో కొందరు " వ్యక్తులు" యున్నారు. వారెవరు? (1) దేవుడు రక్షించును. బైబిలును విశ్వసించు వారికిది వివాదాస్పదము కాదు (రోమా 6:23). (2) క్రీస్తు రక్షించును. ఇది వివాదాంశము కాదు. "తన ప్రజలను వారి పాపములనుండి ఆయనే రక్షించును గనుక ఆయనకు యేసు అను పేరు పెట్టుదువనెను" (మత్తయి 1:21). (3) పరిశుద్ధాత్ముడు రక్షించును. ఎట్లు ? రక్షణ కలుగజేయుటకు సువార్త దేవుని శక్తియై యున్నదని పౌలు చెప్పెను. (రోమా 1:16). పరలోకము నుండి పంపబడిన పరిశుద్ధాత్ముని వలన సువార్త ప్రకటించితిమని పేతురు చెప్పెను ( I పేతురు 1:12). సువార్త ప్రకటించుటకు అపొస్తలులకు సామర్థ్యత కలుగజేసిన పరిశుద్ధాత్ముడు సువార్త ద్వారా రక్షించును. (4) అపొస్తలులు రక్షించెదరు. ప్రజల కన్నులు తెరచి, వారిని చీకటిలో నుండి వెలుగులోనికి తెచ్చుటకు పౌలును క్రీస్తు పంపెను (అపొ 26:16-18). (5) మనలను మనమే రక్షించుకొందుము. దీనిని నమ్మకూడదని నీవు తలంచుచున్నావా? దేవుడు మనలను రక్షించునని నీవు విశ్వసించుచున్నావా? అవును గదా? ఎందువలన ? బైబిలు ఆ విధముగా చెప్పుచున్నది గనుక నీవును చెప్పుదువు. కాని బైబిలు యిట్లు చెప్పుచున్నది. "మీరు మూర్ఖులగు ఈ తరము

వారికి వేరై రక్షణ పొందుడి" (అపో 2:40). "మీ సొంత రక్షణను కొనసాగించుకొనుడి" (ఫిలిప్పీ 2:12). వీటిని కూడ నీవెందుకు విశ్వసింపవు ? మనలను మనమే రక్షించుకొన్నట్లైతే దేవుడు మనలనెట్లు రక్షింపగలడో నాకు అర్థముగాకున్నదని నీవు అనవచ్చును. నీవెన్నడును గ్రాహ్యము చేసికొనకున్నను బైబిలు ఆలాగు చెప్పుచున్నది గనుక అది సత్యమే. అది యెట్లగునో మనము ఇప్పుట చూతము. (6) మనము యితరులను రక్షింతుము. నేను దీనిని నమ్మనని మరల చెప్పుదువు. నీవు బైబిలును నమ్ముదువా ? అయితే వినుము: "అగ్నిలో నుండి లాగినట్టు కొందరిని రక్షించుడి" (యూదా 1:23). "నిన్ను గూర్చియు నీ బోధను గూర్చియు జాగ్రత్త కలిగి యుండుము; వీటిలో నిలుకడగా యుండుము; నీ వీలాగు చేసి నిన్నును నీ బోధ విను వారిని రక్షించుకొందువు " (I తిమోతి 4:16).

ఈ క్రింది వాటి వలన మనము రక్షింపబడుదుము :

1. **కృప వలన.** "మీరు విశ్వాసము ద్వారా కృప చేతనే రక్షింపబడి యున్నారు" (ఎఫెసీ 2:8). మనము కృప వలన రక్షింపబడితిమని అపొస్తలుడు తెలియజేసి యున్నాడే గాని "కృప వలన మాత్రమే" యని చెప్పుట లేదు.

2. **రక్తము వలన.** "రక్తము చిందింపబడకుండ పాపక్షమాపణ కలుగదు" యని పౌలు చెప్పుచున్నాడు (హెబ్రీ 9:22). "ఏలయనగా ఎడ్ల యొక్కయు మేకల యొక్కయు రక్తము పాపములను తీసివేయుట అసాధ్యము" (హెబ్రీ 10:4). "నిర్జీవ క్రియలను విడచి జీవముగల దేవుని సేవించుటకు క్రీస్తు యొక్క రక్తము మీ మనస్సాక్షిని ఎంతో ఎక్కువగా శుద్ధిచేయును" (హెబ్రీ 9:14). "యేసు రక్తము వలన పరిశుద్ధ స్థలము నందు ప్రవేశించుటకు మనకు ధైర్యము కలిగియున్నది" (హెబ్రీ 10:19).

3. సువార్త వలన. "మరియు సహోదరులారా, నేను మీకు ప్రకటించిన సువార్తను తెలియజేయుచున్నాను. మీరు దానిని అంగీకరించితిరి, దాని యందే నిలిచియున్నారు. ఆ సువార్త వలననే మీరు రక్షణ పొందుదురు" (I కొరింథీ 15 : 1,2).

4. సువార్త ప్రకటన. పౌలిట్లు చెప్పుచున్నాడు, " సువార్త ప్రకటనయను వెఱ్ఱితనము చేత నమ్మువారిని రక్షించుట దేవుని దయాపూర్వక సంకల్పమాయెను" ( I కొరింథీ 1:21). "సర్వ సృష్టికి సువార్తను ప్రకటించుడి" (మార్కు 16:15). " రక్షణ కలుగ జేయుటకు అది (సువార్త) దేవుని శక్తియై యున్నది" రోమా 1:16.

5. విశ్వాసము వలన రక్షింపబడితిమి. "ప్రభువైన యేసు నందు విశ్వాసముంచుము, అప్పుడు నీవును నీ యింటి వారును రక్షణ పొందుదురు. (అపొ 16 : 31). "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును" (మార్కు 16:16). మేము "విశ్వాసము వలన మాత్రమే" రక్షింపబడలేదు. మేముకృప, రక్తము, సువార్త ద్వారా రక్షింపబడతామని బైబిలు చెప్పుచుండగా కేవలము విశ్వాసము వలన మాత్రమే యెట్లగును? విశ్వాస మూలమున మాత్రము గాక క్రియల మూలముననను నీతి మంతుడని యెంచబడునని యాకోబు చెప్పుచున్నాడు. (యాకోబు 2 : 24-26).

6. మారుమనస్సు వలన రక్షింపబడితిమి. " మీరు మారుమనస్సు పొందని యెడల మీరందరును ఆలాగే నశింతురు " (లూకా 13 : 3). " మీ పాపములు తుడిచి వేయబడు నిమిత్తము మారుమనస్సునొంది తిరుగుడి" (అపొ 3 : 19).

7. ఒప్పుకొనుట వలన రక్షింపబడితిమి. " యేసు ప్రభువని నీ నోటితో ఒప్పుకొని , దేవుడు మృతులలో నుండి ఆయనను లేపెనని నీ హృదయమందు విశ్వసించిన యెడల, నీవు రక్షింపబడుదువు" (రోమా 10:9). "మనుష్యుల యెదుట నన్ను ఒప్పుకొను వాడెవడో పరలోకమందున్న నా తండ్రి యెదుట నేనును వానిని ఒప్పుకొందును." (రోమా 10 :10).

8. బాప్తిస్మము వలన రక్షింపబడితిమి. ఆ విషయములో నేను మీతో ఏకీభవించను అని ఒకడు చెప్పును. వేరొకనితో నీవు ఏకీభవించక పోవుట కొద్దిపాటిదే యగును గాని అపొస్తలులతో నీవు అసమ్మతి కలిగియుండకుండునట్లు జాగ్రత్త పడుట శ్రేయస్కరము. ఏలయనగా వారు భూమిమీద యేమైనను బంధించితే పరలోకమందును బంధింపబడునని క్రీస్తు చెప్పెను! (మత్తయి 16 : 19). మరియు పౌలుయిట్లు చెప్పెను; "మరియొక సువార్తను......... దూతప్రకటించిన ఎడల అతడు శాపగ్రస్తుడవునుగాక"(గలతి1:8,9).

అతిముఖ్యమైన విషయమేమంటే ; నీవు బైబిలుతో ఏకీభవింతువా? నీవు విశ్వాసము వలన రక్షింపబడితివని బైబిలుచెప్పినపుడు దానిని విశ్వసింతువా?నీవు నిశ్చయముగా నమ్ముదువు. మనము బాప్తిస్మము వలన రక్షింపబడితిమని బైబిలు చెప్పినపుడు దానిని ఎందుకునమ్మవు? మనము ఈ రెండిటి వలననూ రక్షింపబడితిమని అపోస్తలులుచెప్పుచున్నారు. "మారు మనస్సుపొంది పాపవిముక్తి నిమిత్తము మీలో ప్రతివాడును యేసు క్రీస్తు నామమును బాప్తిస్మము పొందుడు " (అపొ. 2:38). "క్రీస్తు లోనికి బాప్తిస్మము పొందినమీరందరూ క్రీస్తును ధరించుకొని ఉన్నారు" (గలతి3:27). " దానికి సాదృశ్యమయిన బాప్తిస్మమిప్పుడు మనలను రక్షించుచున్నది"(I పేతురు 3:21).

9. క్రియల వలవ రక్షింపబడితిమి : క్రియల వలన అనునది యిక్కడ క్రైస్తవ జీవిత లక్షణములను సూచించును. సువార్తకు విధేయులమగుట చేత మనము క్రైస్తవులమైతిమి. మన స్వరక్షణను భయముతోను వణుకుతోను కొనసాగించుకొనుట వలన మనము పరలోకము చేరుదుము (ఫిలిప్పీ 2 : 12).

- C.A. వీలర్

కొండ మీద ప్రసంగము - 21

# రహస్యమున ధర్మము చేయుట

## ALMS GIVING IN SECRET

## (మత్తయి 6:1-4)

యేసుప్రభువు కొండమీద చేసిన ప్రసంగమును మత్తయి 5,6,7 అధ్యాయాల్లో మనము కనుగొన గలము. ఇంతవరకు మత్తయి 5వ అధ్యాయములో 19 ప్రాముఖ్యాంశములను గూర్చి ఈ పాఠముల ద్వారా నేర్చుకొని యున్నాము. ఈ రోజు మత్తయి 6:1-4 వరకు చదువు కొని ధ్యానించుదాము. ప్రభువు ఈలాగు చెప్పారు :

"మనుష్యులకు కనబడవలెనని వారి యెదుట మీనీతి కార్యము చేయకుండ జాగ్రత్తపడుడి; లేనియెడల పరలోక మందున్న మీ తండ్రి యొద్ద మీరు ఫలము పొందరు. కావున నీవు ధర్మము చేయునప్పుడు, మనుష్యుల వలన ఘనత నొందవలెనని వేషధారులు సమాజ మందిరములలోను వీధులలోను చేయులాగున నీముందర బూర ఊదింపవద్దు; వారు తమ ఫలము పొంది

యున్నారని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను. నీవైతే ధర్మము చేయునప్పుడు, నీ ధర్మము రహస్యముగా నుండు నిమిత్తము నీకుడి చెయ్యి చేయునది నీయెడమ చేతికి తెలియక యుండవలెను. అట్లయితే రహస్యమందు చూచు నీ తండ్రి నీకు ప్రతిఫలమిచ్చును".

మనుష్యులకు కనబడవలెనని నీతి కార్యములు, ధర్మకార్యములు చేయుటను యేసు ప్రభువు ఇక్కడ ఖండించియున్నారు. క్రైస్తవుని నీతి, శాస్త్రుల యొక్కయు పరిసయ్యుల యొక్కయు నీతికి మించినదై యుండాలి. వారైతే తమ నీతి కార్యములు, ధర్మ కార్యములు మనుష్యుల ముందర వారికి కనబడేలాగున చేసేవారు. క్రీస్తు అనుచరులు ఆలాగున ఉండరాదు. మనుష్యుల ఎదుట మన వెలుగును ప్రకాశింప జేయాలని చెప్పబడింది, నిజమే. పవిత్రమైన జీవితం యొక్క ప్రభావం చాలగొప్పది. దాన్ని ఎవరు దాచిపెట్టలేరు. కొండమీద నుండు పట్టణం మరుగైయుండనేరదు. అందువలన పరలోకమందున్న పరిశుద్ధ దేవుడు మహిమ పరచబడునట్లు క్రైస్తవులు తమ సత్క్రియలను వెలుగువలె ప్రకాశింపజేయాలి. మనుష్యుల యెదుట సత్క్రియలు చేయబడుటను యేసు ప్రభువు ఖండించలేదు గాని ఆక్రియల యొక్క ఉద్దేశం, కేవలం మనుష్యులకు కనబడాలని మాత్రమే చేస్తే వాటిని ఆయన ఖండించారు. మనుష్యుల వలన ఘనత పొందాలని , మెప్పుపొందాలని వారి యెదుట చేయబడే నీతి కార్యములు ఆత్మను విషపూరితం చేస్తాయి. బహిరంగ ప్రదర్శన నిమిత్తం చేయబడే నీతి కార్యములు, నీతి కార్యములు కానేకావు. అవన్నీ బహిరంగ నాటకీయములే. వాటికి లోతు వుండదు. యదార్థత ఉండదు. ప్రతి నైతిక క్రియకు రెండు భాగములుంటాయి. బహిర్గతము, అంతరంగికము.

మనం బహిర్గతాన్ని మాత్రమే చూడగలుగుతాము. అదిమనకు బాగానే కన్పడ వచ్చును. గాని దాని అంతరంగిక ఉద్దేశ్యము సరియైనది కాకపోతే అది దేవునికి హేయము. ఒకడు చేయు కార్యమునకు ఆత్మీయ విలువను శక్తిని, బలమును యిచ్చేది, ఆక్రియ వెనుక నున్న ఉద్దేశ్యమవుతాది. హృదయంలోని ఉద్దేశ్యము పవిత్రమైన దయితే అది చేయు కార్యము దేవుని దృష్టిలో సుందరమైనది, పవిత్రమైనది అవుతాది. అంతరంగ ఉద్దేశ్యము స్వార్థముతో కూడినదయితే అది చేయు కార్యము మానవులకు ఎంత ఘనంగా కనపడినను ఆత్మీయంగా అది నిష్ ప్రయోజం. పరలోకమందున్న తండ్రినుండి దానికి కలుగు ఫలం శూన్యం.

## వేషధారణ కూడదు

తప్పుడు ఉద్దేశ్యములతో పని చేయువారు వేషధారులు. వారు చేయునదంతయు అబద్ధమే. కావున నీవు ధర్మము చేయునప్పుడు వేషధారుల వలె నీముందర బూర ఊదింపవద్దు అని ప్రభువు చెప్పారు. వేషధారియైన వాడు మనుష్యుల యెదుట ఆడే నాటకం ఒక భాగం. తనది కాని వ్యక్తిత్వాన్ని అతడు ధరింపబూనుకొంటాడు. అతడు వీధులలో ధర్మము చేయవచ్చును, గాని దాన్ని అంతా మనుష్యులు చూడాలని కోరుకొంటాడు. బీదలను గూర్చి అతడు తన హృదయంలో ఏమాత్రం జాలి పడడు. అతడు దయగలవాడు కూడ కాదు. మంచి చేయాలని నిజంగా అతడు అనుకొనడు. మనుష్యుల వలన ఘనత పొందాలనేదే అతనికున్నా కోరిక అంతా. అయితే దేవుడు హృదయాన్ని పరిశీలిస్తాడని అతడెరుగడు. అతడు సమాజమందిరములలోను,

సంఘములోను బీదలకొరకు యిస్తాడు. అక్కడ కూడ సమస్తాన్ని చూచుచున్న దేవుని యొక్క ఉనికిని మరచి, తనయొక్క ఘనతనే కోరుకొంటాడు. అట్టివారు తమ ఫలము పొందియున్నారని నిశ్చయముగా మీతో చెప్పుచున్నానని, మన ప్రభువు అన్నారు.

## శుద్ధ హృదయం కావాలి

శుద్ధ హృదయంతో నీతి కార్యములు, ధర్మకార్యములు చేయువారి ఉద్దేశ్యం ఒకే ఒక్కటి. అది దేవుని ఘనత. క్రైస్తవుడు యిచ్చునప్పుడు ప్రేమ కలిగి యిస్తాడు. దేవుని యెడల, తోటి మానవుని యెడల ప్రేమ కలిగి యిస్తాడు. అతడు మనుష్యుల మెప్పును కోరడు. అతడు నిష్కపట హృదయంతో, వినయము కలిగి యిస్తాడు. అతడు సాధ్యమైనంత మట్టుకు మనుష్యులకు కనబడ కుండా తన ధర్మకార్యములు చేయగోరతాడు. ఏలయనగా అతడు విశ్వాసము వలన జీవిస్తాడు. విశ్వాసము అదృశ్యమైన సంగతుల ఉనికిని నమ్ముతాది. అతడు అదృశ్యదేవుని సమక్షమున ఎల్లప్పుడు జీవిస్తాడు గనుక ఎల్లవేళలా ఆయననే సంతోష పెట్టుటకు ప్రయత్నం చేస్తాడు.

నీవైతే ధర్మము చేయునప్పుడు, నీ ధర్మము రహస్యముగానుండు నిమిత్తము నీకుడి చెయ్యి చేయునది నీ యెడమచేతికి తెలియక యుండవలెను. అట్లయితే రహస్యమందు చూచు నీ తండ్రి నీకు ప్రతి ఫలమిచ్చును అని యేసు ప్రభువు బోధించారు. మన తండ్రియైన దేవుడు రహస్యమందు చూచుచున్నాడు. సూర్యుని క్రింద ఆయనకు మరుగైనది ఏదియులేదు. యిది చాల భయంకర మైన వాస్తవము. ఆయన మన జీవితము యొక్క అసలైన భావాన్ని

ఎరిగినవాడు. మన తలంపుల యొక్కయు, క్రియల యొక్కయు అసలైన ఉద్దేశాన్ని ఎరిగినవాడు. ఆయన యెదుట మనం ఏవిధమైన వేషాన్ని ధరించలేము. వేషధారియొక్క ముసుకు ఆయనకు తెలుసు. అతని హృదయంలో యున్న స్వార్థం, అహంకారం ద్వేషం వగయిరా అన్నీ ఆయనకు తెలుసు.

దేవుడు రహస్యమందు చూచుచున్నాడు. ఆ అదృశ్యదేవుని సన్నిధిలో ఆయనకు వినయ విధేయతలు గలిగి జీవించువారిని ఆయన ఎరుగును. ఆయన రహస్యమందు చూచుచున్నా, వారికి బహిరంగముగానే ప్రతిఫలము దయచేయును. " తన మహిమతో మనుష్య కుమారుడును, ఆయనతో కూడ సమస్త దూతలును వచ్చునప్పుడు ఆయన తన మహిమగల సింహాసనము మీద ఆసీనుడైయుండును. అప్పుడు సమస్తజనములు ఆయన యెదుట పోగు చేయబడుదురు. గొల్లవాడు మేకలలోనుండి గొర్రెలను వేరు పరచునట్లు ఆయన వారిని వేరు పరచి తనకుడివైపున గొర్రెలను ఎడమవైపున మేకలను నిలువబెట్టును. అప్పుడు రాజు తన కుడివైపున ఉన్నవారిని చూచి-నా తండ్రి చేత ఆశీర్వదింపబడిన వారలారా, రండి. లోకముపుట్టినది మొదలుకొని మీ కొరకు సిద్ధపరచబడిన రాజ్యమును స్వతంత్రించుకొనుడి. నేను ఆకలిగొంటిని, మీరు నాకు భోజనము పెట్టితిరి; దప్పిగొంటిని నాకు దాహమిచ్చితిరి; పరదేశినై యుంటిని నన్ను చేర్చు కొంటిరి; చెరసాలలో ఉంటిని నాయొద్దకు వచ్చితిరని చెప్పును." అప్పుడు వారు ప్రభువా ఇవన్నీమేము నీకు ఎప్పుడు చేసాము అని చెప్పి ఆశ్చర్యపోవుదురు. " అందుకు రాజు మిక్కిలి అల్పులైన యీనా సహోదరులలో ఒకనికి మీరు చేసితిరి గనుక నాకును చేసితిరని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను" అనును. ఆయన ఎడమవైపున ఉండువారిని చూచి శపింపబడిన వారలారా, నన్ను విడిచి, అపవాదికిని వాని దూతలకును

సిద్ధపరచబడిన నిత్యాగ్నిలోనికి పోవుడియని చెప్పును. వీరు నిత్యశిక్షకును, నీతిమంతులు. నిత్యజీవమునకును పోవుదురు (మత్తయి 25:31-46).

ఆయన యిచ్చు నిత్యజీవము ఒక బహుమానము. అది దేవుని బహుమానము. మనము దేవునికి చేయు పరిచర్యకు మించి కొన్ని కోట్లాను కోట్ల రెట్లు గల బహుమానము అది. దానికి మనం తగము. గాని ఆయన కృపవలననే దానిని మనకిచ్చుచున్నాడు.

మనం ధర్మము చేయాలని ఆయన కోరుచున్నాడు. అక్కరగలవానికి పంచి పెట్టుటకు మన చేతులతో అందుకే కష్టపడి పనిచేయాలి (ఎఫెసీ 4:28). ధర్మకార్యాలు దేవునికి తెలిస్తే చాలు. మానవులకు తెలియనక్కర్లేదు. అవి వ్యక్తిగత కార్యములు : అందువలననే పుచ్చుకొనుటకంటె యిచ్చుటమంచిది అని లేఖనములు చెప్పుచున్నవి. దేవుడు నిన్ను, నీ ధర్మ కార్యములను అంగీకరించాలంటే నీవాయనను ముందు అంగీకరించాలి. యేసు ప్రభువునందు విశ్వసించాలి, నీపాపముల విషయమై మారుమనస్సు పొందాలి. పాపక్షమాపణ నిమిత్తం బాప్తిస్మము పొందాలి. ఆయన సంఘ సభ్యుడవై ఆయన మహిమ కొరకు జీవించాలి !!

- జాషువా గూటం

## సంఘమునకు అక్కరలేనివారు

నేటి లోకములో ప్రాముఖ్యమైన పనులు, పదవులు, బాధ్యతలు స్వీకరించుటకు అవసరమైన వారు ఎట్లు కావలెనో అట్లే ఆయాపనులకు, పదవులకు, అక్కరలేనివారు కూడా యుందురు. ఉదా : 30 సం॥ వయస్సు పైబడినవారు కొన్ని ప్రభుత్వ ఉద్యోగములకు అక్కరలేదు.

సంఘము చాలా ప్రాముఖ్యమైనది అది ఆత్మీయముగాను, సంఖ్యలోను అభివృద్ధి చెందుటకు అక్కరలేని వారెవరో గమనించి వారిని అక్కరగలవారినిగా చేయవలసిన బాధ్యత సంఘమునకు కలదు. సంఘము బలము పొందుటకు, క్రీస్తు నందు ఎదుగుటకు క్రింద పేర్కొనబడినవారు సంఘమునకు అక్కరలేదు.

1. పెదవులతో ప్రార్థించువారు (మత్తయి 15 : 7 -9)
2. "నాకు విశ్వాసమున్నది" అని చెప్పుచూ క్రియలు చేయనివారు (2 తిమోతి 3 : 5; యాకోబు 2 : 14 - 20, 26).
3. ఆత్మతోను సత్యముతోను ఆరాధించుటకు నిరాకరించువారు (యోహాను 4 : 24; 17 :17) .
4. వర్థిల్లిన కొలది కానుకలు దేవుని సన్నిధికి తీసికొనిరానివారు ( Iకొరింథి 16 : 1 - 2; 2 కొరింథి 9 : 6 - 7)
5. ఆరాధనకు నమ్మకముగా హాజరు కానివారు (హెబ్రీ 10 : 25)
6. దిక్కులేని పిల్లలను విధవరాండ్రను వారి యిబ్బందిలో పరామర్శించని వారు (యాకోబు 1 : 27).
7. లోకమును, దాని భోగములను విసర్జింపలేనివారు. ( I యోహాను 2 : 15 - 17 ; II తిమోతి 3 : 4 ; II తిమో 4 : 10)
8. శాస్త్రులు, పరిసయ్యులవలె వేషధారణ బ్రతుకులు కలిగి క్రీస్తును కలిగి యుండనివారు (మత్తయి 23 : 1 - 15; మార్కు 12 : 38 - 40; లూకా : 20 : 45 - 47).
9. క్రీస్తు బోధ యందు నిలిచియుండక దానిని విడిచి ముందునకు పాగువారు (2 యోహాను 9)

10. సువార్తను ప్రకటించుటకు సిగ్గుపడువారు (రోమా 1 : 16 ; 2 తిమోతి 2 : 15 ; 2 తిమోతి 4 : 2)

11. రెవరెండులు, ఫాదర్ అని పిలువబడేవారు (కీర్త 111 : 9 ; మత్త 23 : 8 - 10)

12. సంఘములో ప్రథమస్థానం కోరువారు (I కొరింథి 11 : 19 ; II కొరిం 10 : 18 ; ఎఫెసీ 5 : 23).

13. నకిలీ బోధను ప్రేమించి, గైకొనువారు (ప్రకటన 22 : 15)

14. భక్తిహీనులతో, అవిశ్వాసులతోను సాంగత్యము చేయువారు (I కొరింథీ 5 : 9 - 11 ; 6 : 9 - 10 ; 11 థెస్స 3 : 6)

15. నీతి నిమిత్తము హింసింపబడుటకు వెనుదీయువారు. (మత్తయి 5 : 11 - 12 ; II తిమో 3 : 12).

కనుక నీవు సంఘమునకు అక్కర గలవానిగా ఉన్నావా? లేక అక్కర లేనివానిగ ఉన్నావా ? నిన్ను నీవే ప్రశ్నించుకొని దేవునికి అక్కరగలవానిగా మారుము. దేవుడు అప్పుడు నీ అక్కరలను తీర్చును.

- పి. చంద్రశేఖర్, కాకినాడ - 3

## ప్రజలు విధేయులగుటకు ఎందుకు నిరాకరించుచున్నారు?

## (Why do people refuse to obey?)

మార్కు 16 : 15 - 16 వచన భాగాలు క్రైస్తవులకే గాక క్రైస్తవేతరులకు కూడ సందేశాన్ని అందించుచున్నవి. క్రైస్తవులకు యేసు చెప్పిన మాట ఏమంటే

"వెళ్ళుము" (GO). మనం వెళ్ళి ఏ సువార్తకైతే విధేయులమైతిమో ఆ సువార్తను ప్రకటించాలి. క్రైస్తవేతరులకు క్రీస్తు చెప్పిన మాట ఏమంటే "నమ్మి బాప్తిస్మము పొందిన వాడు రక్షింపబడును". విని **(లూకా 8 : 8)**, విశ్వసించి **(యోహా 8 : 24)**, మారుమనస్సు పొంది **(లూకా 13 : 3)** క్రీస్తును ఒప్పుకొని **(మత్త 10 : 32 - 33)**, పాప క్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందవలెను. **(అపొ. 2 : 38; 22 : 16).**

సువార్త గ్రహించుటకు కష్టమైనది కాదు. పౌలు చెప్పెను "సర్పము తన కుయుక్తి చేత హవ్వను మోసపరచినట్లు మీ మనస్సులును చెరుపబడి, క్రీసు యెడల నున్న సరళత (Simplicity) నుండియు, పవిత్రత నుండియు ఎట్లయినను తొలగిపోవునేమో అని భయపడుచున్నాను" **(II కొరింథి 11 : 3)**. మార్కు **16 : 15 - 16** సరళమైన భాషలో (Simple Language) వ్రాయబడింది. ఎందుకు అనేకులు విధేయులు కాలేకపోవుచున్నారు?

## ధనాపేక్ష

అనేకులు ధనాపేక్ష వలన విధేయులు కాలేకపోవుచున్నారు. ఎందుకంటే వారు దేవుని కంటె ధనాన్ని ఎక్కువ ప్రేమించుచున్నారు. పౌలు చెప్పెను "సంతుష్టి సహితమైన దైవభక్తి గొప్పలాభసాధనమై యున్నది. మన మీలోకములోనికి ఏమియు తేలేదు. దీనిలో నుండి ఏమియు తీసికొని పోలేము. కాగా అన్న వస్త్రములు గల వారమై యుండి వాటితో తృప్తి పొంది యుందము. ధనవంతులగుటకు అపేక్షించువారు శోధనలోను ఉరిలోను, అవివేక యుక్తములును హానికరములునైన అనేక దురాశలలోను పడుదురు ......

ఎందుకనగా ధనాపేక్ష సమస్త కీడులకు మూలము. కొందరు దానిని ఆశించి విశ్వాసము నుండి తొలగిపోయి నానాబాధలతో తమ్మును తామే పొడుచుకొనిరి' (I తిమో 6 : 6 - 10).

## కుటుంబ ప్రేమ

దేవుని కంటే స్వకీయులనే ఎక్కువ ప్రేమించుట వలన అనేకులు విధేయులు కాలేక పోవుచున్నారు. "ఎవడైనా నా యొద్దకు వచ్చి తన తండ్రిని తల్లిని భార్యను పిల్లలను అన్నదమ్ములను అక్కచెల్లెండ్రను తన ప్రాణమును సహా ద్వేషింపకుంటే వాడు నా శిష్యుడు కానేరడు" (లూకా 14 : 26). "ద్వేషించు" అను పదం "ఎక్కువగా ప్రేమించవద్దు" అను భావంతో వ్రాయబడింది. (ఆది 29 : 30 - 31 ; ఎఫె 6 : 1). మన కుటుంబ సభ్యులను మనం గౌరవించాలని దేవుడు కోరుచున్నాడు. అయితే ఆయనను మనం ఎక్కువ గౌరవించవలసియున్నది. మన తల్లిదండ్రుల యెడల, సోదరుల యెడల, సోదరీల యెడల, పిల్లల యెడల, భార్య యెడల మరియు భర్త యెడల అవిధేయతతో కూడిన జీవన విధానము ద్వారా మనలను మనం మోసపరచుకొనకుందము.

## మనలను మనం ప్రేమించుకొనుట

దేవుని ప్రేమించుట కంటె తమ్మును తాము ఎక్కువగా ప్రేమించుకొనుట వలన మార్కు 16 : 15 - 16 లో వ్రాయబడిన ఈ వచన భాగాలకు విధేయులగుటకు కొందరు నిరాకరించుచున్నారు. "తన ప్రాణమును

ప్రేమించువాడు దానిని పోగొట్టుకొనును. ఈ లోకములో తన ప్రాణమును ద్వేషించువాడు నిత్య జీవము కొరకు దానిని కాపాడుకొనునని నిశ్చయముగా చెప్పుచున్నాను" (యోహా 12 : 25). మనలను మనం కించపరచుకొనవలెనని యేసు బోధించుట లేదు. మన కొరకై మరణ మొందిన ఆయనను పోలి మనం ఉండాలి. సువార్త విషయమైన విశ్వాసము కొరకు మరణించడానికైనను సంసిద్ధులం కావాలి. తరువాత వచన భాగంలో "ఒకడు నన్ను సేవించిన యెడల నా తండ్రి అతని ఘనపరచును" అని చెప్పెను (యోహా 12 : 26). ఆయన సిలువ మరణమునకు ముందు క్రీస్తు పలికెను : "ఇప్పుడు నా ప్రాణము కలవరపడు చున్నది. నేనేమందును? తండ్రీ యీ గడియ తటస్థింపకుండ నన్ను తప్పించుము. అయినను ఇందుకోసరమే నేను ఈ గడియకు వచ్చితిని" (యోహా 12 : 27).

ప్రభువు గొప్ప వేదనను గూర్చి ముందుగనే ఎరిగియుండెను. తన్ను తాను ప్రేమించుకొనుట యందు ఎక్కువ శ్రద్ధ చూపక ఆయన మరణము ద్వారా సాధించవలసిన కార్యము నిమిత్తమై తన్ను తాను అప్పగించుకొనెను. ఆయన మన గొప్ప మాదిరి. మనం మన కంటె, మన స్వకీయుల కంటె, మన ధనం కంటె దేవుని ఎక్కువగా ప్రేమించవలసిన వారమైయున్నాము. యేసు ఆయన బాధ్యతను నెరవేర్చెను. ఆయన మన కొరకు చనిపోయెను. నీవు నీ బాధ్యతను నెరవేర్చువా? మార్కు 16 : 15 - 16కు విధేయుడవు కమ్ము!

- డేనియల్ వాల్ఫ్రమ్ (TVC)

# సంక్షిప్త వార్తలు

మార్చినెల సువార్తికుల సదస్సు 27వతేదీన భట్నవిల్లిలో జరిగెను. రాష్ట్రంలోని అనేక స్థానిక క్రీస్తు సంఘములనుండి సువార్తికులు తరలి వచ్చిరి. "క్రీస్తు సంఘము ఏల ఒక మత శాఖ కాదు?" అను అంశము చర్చింపబడెను. దేవుని వాక్యపు వెలుగులో చక్కగా సిద్ధపడి వచ్చిన సోదరులు క్షేమాభివృద్ధికరమైన చక్కని వర్తమానములను పై అంశము పై అందించిరి.

ఉదయ కాలపు సమావేశమునకు సోదరులు పాల్ గూటం గారు, మధ్యాహ్న కాలసమావేశమునకు సోదరులు ఎన్. జె. మోహన్‌రావ్ గారు అధ్యక్షులుగా యుండగా, బి. చిరంజీవి, ఎస్. వీరంశెట్టి, ఎన్. మోజెస్, జాషువా గూటం, పి. సామ్యూల్, కె. ప్రసాద్, బి. యోహాను, కె. తాతారావు, పాల్‌గూటం, పి. ఎస్. ఆర్. జైపాల్ గార్లు పై అంశమును చర్చించిరి.

జగత్తు పునాది వేయబడక మునుపే క్రీస్తు సంఘమును దేవుడు సంకల్పించెను (ఎఫెసీ 1 : 4-6). దాని కొరకు క్రీస్తు తన్నుతాను అప్పగించుకొనెను (ఎఫెసీ 5 : 25). తర తరములు సదాకాలము దేవునికి మహిమ క్రీస్తు ద్వారా సంఘములో కలుగుతుంది (ఎఫెసీ 3 : 20-21). క్రీస్తు తన స్వరక్త మిచ్చి సంపాదించిన సంఘము వేరు, మత శాఖలు వేరు. ఈ రెండింటికీ ఎక్కడా పొత్తు కుదరదు.

క్రీస్తు సంఘము దాని బోధలోను, ఆరాధనలోను, పరిపాలనలోను పరిపూర్ణమైనది. దానికి రక్షకుడు, శిరస్సు, వరుడు క్రీస్తే. సమస్త ఆత్మీయ వాగ్దానములకు ఆశీర్వాదములకు నిలయమది. దానిలో మానవ కల్పిత సిద్ధాంతాలకు చోటు లేదు. అది ఒక మత శాఖ కాదు. మానవుని మది నుండి ఉద్భవించినది మత శాఖ, దేవుని మది నుండి ఉద్భవించినది క్రీస్తు సంఘము, అది క్రీ॥శ 33వ సంవత్సరములో, పెంతెకొస్తు అను పండుగ దినమున, యెరూషలేములో, క్రీస్తుచే స్థాపించబడినది. మతశాఖల ఆరంభ స్థానము, సమయము, స్థాపకులు వేర్వేరు. యెషయా, యిర్మియా మొదలగు ప్రవక్తలు

దీనిని గూర్చి ప్రవచించిరి. పరిశుద్ధాత్మ ప్రేరిత లేఖనాలనే బోధిస్తూ, మానవుని రక్షణను లోకానికి ప్రకటిస్తు దేవుని ఘనతనే కోరుచున్నది క్రీస్తు సంఘం. పండుగలకు వినోదాలకు యిందు తావు లేదు.

భట్లవిల్లిలోని క్రీస్తు సంఘము, అక్కడ సువార్తికునిగా పని చేయుచున్న కె. జార్జిగారు సదస్సు కొరకు మంచి ఏర్పాట్లు చేసి, వచ్చిన సువార్తికులను చక్కగా ఆదరించిరి.

ఆ రాత్రి సింగరాయ పాలెంలో జరిగిన సువార్త కూటములో జాషువా, గూటం గారు, పాల్ గూటం గారు గొప్ప సందేశముల నిచ్చిరి. అక్కడ నూతనముగా నిర్మించబడిన ప్రార్థనా మందిర ప్రవేశము గావించిరి. అనేక వందలమంది స్త్రీ పురుషులు హాజరై దేవుని వాక్యమును అత్యాసక్తితో ఆలకించిరి. సింగరాయపాలెంలోను, పరిసర ప్రాంతములలోను సోదరులు ఇ.కె.వి. ప్రసాద్‌గారు సువార్త ప్రకటించుచున్నారు. క్రీస్తు కొరకు గొప్ప పని చేయుచున్నారు.

---

Regd. No. H/KD-46/KD H.O.
Date of Posting : 15th of Every month

From

**SATYA WAKKU**
P.O. Box 80
KAKINADA - 533 001

To